'ఎట్ హోమ్' ఆహ్వానం అందుకున్న ఆకర్షణ

ఆకర్షణ

అమీర్‌పేట్, ఆగస్టు 12: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగే సంప్రదాయ 'ఎట్ హోమ్' రిసెప్షన్ ఆహ్వానాన్ని అందుకున్నారు నగరానికి చెందిన ఆకర్షణ సతీశ్. బేగంపేట్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ గ్రేడ్ చదువుతున్న ఆమె తాను స్వయంగా సేకరించిన 9,836 పుస్తకాలతో ఇప్పటివరకు తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో 15 గ్రంథాలయాలను నెలకొల్పడం విశేషం. ఈ విషయాన్ని ప్రధాని మోదీ స్వయంగా తాను నిర్వహించే 'మన్ కీ బాత్'లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగే సంప్రదాయ 'ఎట్ హోమ్' రిసెప్షన్‌కు దేశవ్యాప్తంగా ప్రత్యేకత కలిగి ఉన్న 29మందికి ఆహ్వానాలు అందగా, వారిలో నగరానికి చెందిన ఏకైక బాలిక ఆకర్షణ కావడం గమనార్హం.

రెండు లా కాలేజీల్లో అడ్మిషన్లు నిలిపివేత

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): వరంగల్ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లా, కాకతీయ విశ్వవిద్యాలయం(వరంగల్), అనంత లా కాలేజీ(కూకట్‌పల్లి)లో న్యాయశాస్త్ర ప్రవేశాలు ఆపినట్టు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తరపు సీనియర్ న్యాయవాది రవిచందర్ హైకోర్టుకు నివేదించారు. మిగిలిన కాలేజీల్లో 5 నుంచి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం అడ్మిషన్లకు కౌన్సెలింగ్ ప్రారంభమైందని తెలిపారు. యూజీసీ నిబంధనలు ఉల్లంఘించడాన్ని సవాలు చేస్తూ న్యాయవాది భాస్కర్ రెడ్డి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్‌తో కూడిన ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. లా కాలేజీలు, నల్సార్ విశ్వవిద్యాలయం బకాయిలున్నాయని రవిచందర్ చెప్పడంపై చీఫ్ జస్టిస్, నల్సార్ వర్సిటీకి చాన్సలర్‌గా ఉన్న కారణంగా వ్యాజ్యాన్ని విచారించేందుకు నిరాకరించారు. జస్టిస్ సుజయ్‌పాల్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపడుతుందని చీఫ్ జస్టిస్ ప్రకటించారు.

సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ గౌడ్

వైన్స్ అక్రమ సిట్టింగులను తొలగించాలి

- బార్, రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్

ఖైరతాబాద్, ఆగస్టు 12: రాష్ట్రంలోని వైన్ షాపుల వద్ద అక్రమ సిట్టింగులను తొలగించాలని బార్ అండ్ రెస్టారెంట్ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 25 ప్రకారం వైన్‌షాప్ పర్మిట్ గది 100 చదరపు మీటర్లు ఉండాలని, ఎలాంటి బెంచీలు, కుర్చీలు, తినుబండారాలు లేకుండా నిర్వహించాలని పేర్కొన్నారు. వైన్స్‌కు, బార్లకు మధ్య ఉన్న దూరాన్ని పెంచి, బార్‌ల వైశాల్యంపై విధిస్తున్న అధిక పన్నును ఉపసంహరించుకోవాలని, కనీసం 700 చదరపు మీటర్ల వైశాల్యాన్ని పెంచాలని కోరారు. లైసెన్సు రెన్యువల్ విధానాన్ని ఐదేండ్లకోసారి చేపట్టాలని, బార్ రెంటల్ అగ్రిమెంట్ విధానాన్ని ట్రేడ్ లైసెన్స్ ఫీజులాగా రెంటల్స్‌పై స్టాంప్ డ్యూటీ రూపంలో తీసుకోవాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రామకృష్ణ, రాజు గౌడ్, నరసింహ గౌడ్, వెంకన్నగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి తిరుపతయ్యగౌడ్, సంయుక్త కార్యదర్శి నిరంజన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీకి 6 వేల లంచం!

- అలాగైతేనే బుకింగ్.. లేకుంటే లేదు
- లోడింగ్ పేరుతో మరో రూ.వెయ్యి
- ఒక్కో లారీపై రూ.7,000 అదనపు వసూలు
- పనిచేయని టీజీఎండీసీ ఆన్‌లైన్ వ్యవస్థ
- బాట్ సాఫ్ట్‌వేర్‌తో అక్రమంగా బుకింగ్
- వినియోగదారులపై తప్పని భారం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న అధికారులు

టీజీఎండీసీ కార్యాలయంలో చైర్మన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న లారీ యజమానులు

హైదరాబాద్, ఆగస్టు 12(నమస్తే తెలంగాణ): 'ఇసుక కోసం ఎక్కడికీ వెళ్లాల్సిన పని లేదు. ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకుంటే ఇంటికే వస్తుంది' అంటూ టీజీఎండీసీ అధికారులు చెప్తున్న మాటలు బూటకమని తేలిపోయింది. ఒక్కో లారీ ఇసుక బుకింగ్‌కు రూ. 6 వేల లంచం సమర్పించుకుంటే తప్ప బుకింగ్ కావటం లేదు. లోడింగ్ పేరుతో మరో రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారు. దీంతో ఈ మొత్తాన్ని లారీ యజమానులు వినియోగదారులపై మోపుతున్నారు. లంచాన్ని నిలువరించాలని కోరుతూ సోమవారం లారీ యజమానులు టీజీఎండీసీ కార్యాలయంలో ఆందోళన నిర్వహించి చైర్మన్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా టీజీఎండీసీ ద్వారా ప్రతి నెల సగటున వర్షాకాలంలో 20 లక్షల మెట్రిక్ టన్నులు, మిగిలిన కాలాల్లో 40 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున ఇసుక విక్రయాలు జరుగుతాయి. బల్క్‌గా ఇసుకు తెచ్చుకునే బడా బిల్డర్లు తప్ప చిన్నాచితకా బిల్డర్లు, సొంతంగా ఇండ్లు నిర్మించుకునేవారు సహజంగానే సమీపంలోని ఇసుక లారీ అడ్డాల నుంచే ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. టీజీఎండీసీ ప్రతి టన్నుకు రూ.450 చొప్పున విక్రయిస్తుంటే, లారీ యజమానులు బుకింగ్ చేసుకొని స్టాక్‌యార్డుల నుంచి ఇంటికి చేర్చేందుకు ప్రస్తుతం టన్నుకు రూ.2,500చొప్పున వసూలు చేస్తున్నారు. ఒక్కో లారీలో సుమారు 35 నుంచి 45 టన్నుల ఇసుకను తరలిస్తూ వినియోగదారుల నుంచి 35 టన్నులకు రూ.87,500, 45 టన్నులకు రూ.1,12,500 చొప్పున వసూలు చేస్తున్నారు. అంటే, ఒక్కో టన్ను ఇసుకపై లారీ యజమానులు రూ.2,000కుపైగా వినియోగదారులనుంచి వసూలు చేస్తున్నారు. ఇందులో రూ.1,000 రవాణా ఖర్చులు పోగా, మిగిలిన రూ.1,000లో లారీ యజమానుల లాభాలు, అధికారుల అమ్యామ్యాలు ఉంటున్నాయి. ప్రస్తుతం టీజీఎండీసీ ఆన్‌లైన్ ద్వారా బుకింగ్‌లు కావటం లేదు. కొన్ని ఎంపిక చేసిన మీసేవ కేంద్రాల్లో 'బాట్ సాఫ్ట్‌వేర్' ద్వారా బుకింగ్ చేసుకుంటేనే బుకింగ్ అవుతుందని లారీ యజమానులు చెప్తున్నారు. దీనికోసం ఒక్కో బుకింగ్‌కు రూ.5,000-6,000 అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని వారు వాపోతున్నారు. బుకింగ్‌లో సమస్యల వెనుక టీజీఎండీసీ అధికారుల పాత్ర ఉన్నదన్న ఆరోపణలున్నాయి. స్టాక్‌యార్డ్‌ల వద్ద ఇసుకను లారీలో లోడింగ్ చేయాల్సిన బాధ్యత టీజీఎండీసీ నియమించిన కాంట్రాక్టరుదే అయినా.. ఇసుక లారీల వద్ద లోడింగ్ పేరుతో అక్రమంగా రూ.1,000 చొప్పున వసూలు చేస్తున్నారు.

లంచాలతో భారీగా పెరిగిన ఇసుక ధర

వర్షాకాలంలో ఇసుక తవ్వకంతోపాటు రవాణాలో కూడా ఇబ్బందులు ఉంటాయి కాబట్టి సహజంగానే ఇతర కాలాలతో పోల్చుకుంటే ఇసుక ధర టన్నుకు రూ.100 నుంచి రూ.200 ఎక్కువగా ఉంటుంది. బీఆర్ఎస్ హయాంలో వర్షాకాలంలో సైతం ఇసుక ధర రూ.1,500 దాటలేదు. కానీ ఇప్పుడు ఏకంగా రూ.2,500 చేరుకోవటం గమనార్హం. టీజీఎండీసీ వద్ద ధర యథావిధిగా టన్నుకు రూ.450 మాత్రమే ఉన్నప్పటికీ ఇసుక లారీలపై అధికారుల వేధింపులు, లంచాల వసూళ్లు ఎక్కువై పోవటంతో ఇసుక ధర టన్నుకు రూ.1,000 వరకు పెంచక తప్పటం లేదని లారీ యజమానులే చెప్తున్నారు. అలాగే, ఇసుక స్టాక్‌యార్డ్‌లకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేయించాల్సిన టీజీఎండీసీ.. వాటిని పట్టించుకోవడంలేదు. దీనివల్ల లారీ యజమానులకు నిర్వహణ ఖర్చులు పెరిగిపోయి.. ఆ భారాన్ని కూడా వినియోగదారులపైనే మోపుతున్నారు. ఇటీవల మావోయిస్టు వారోత్సవాల పేరుతో ఇసుక తరలింపును నిలిపివేశారు. దీంతో ఇసుకకు మరింత కొరత ఏర్పడింది. ఇలా రకరకాల కారణాలతో అధికారులే ఇసుకకు కృత్రిమ కొరత సృష్టిస్తూ ధరలు పెరిగేందుకు దోహదపడుతున్నారు.

రాష్ట్రంలో ఇసుక రవాణా వివరాలు

- ఇసుక రీచ్‌లు 76 ఉండగా ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి 19
- టీజీఎండీసీ ద్వారా వర్షాకాలంలో ప్రతి నెల సరఫరా - 20 లక్షల టన్నులు
- ఇతర కాలాల్లో నెలకు - 30 నుంచి 40 లక్షల టన్నులు
- టీజీఎండీసీ నిర్ధారించిన ఇసుక ధర టన్నుకు రూ.450
- లారీ యజమానులు ప్రస్తుతం వసూలు చేస్తున్నది టన్నుకు రూ.2,500
- బుకింగ్, లోడింగ్ పేరుతో అక్రమంగా ఒక్కో లారీ నుంచి అధికారులు వసూలు చేస్తున్న మొత్తం రూ.7,000
- ఈ భారాన్ని నేరుగా వినియోగదారులపైనే వేస్తున్న లారీ యజమానులు

నిలిచిపోయిన రీచ్‌లతో మరింత కొరత

రాష్ట్రంలో 76 ఇసుక రీచ్‌లకుగాను ప్రస్తుతం 19 పనిచేస్తున్నాయి. ఎన్జీటీ కేసుల వల్ల కొన్ని నిలిచిపోగా, మరికొన్ని నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండటం వల్ల ఇసుక తీయటం సాధ్యంకాక నిలిపివేశారు. మేడిగడ్డ బరాజ్ వద్ద ఇసుక తవ్వకాలకు టెండర్లు ఖరారైనప్పటికీ నదిలో వరద అధికంగా ఉండటంతో ఇసుక తవ్వకం ఇంకా ప్రారంభం కాలేదు. అధికారులు సృష్టిస్తున్న కృత్రిమ కొరతకు తోడు రీచ్‌లు మూతపడటంతో డిమాండ్‌కు తగ్గంత ఇసుక సరఫరా కావటం లేదు. భద్రాద్రి కొత్తగూడెం, ములుగు తదితర ప్రాంతాల్లో స్థానిక రాజకీయ నాయకుల జోక్యంతో ఇసుక తవ్వకం, రవాణాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్తున్నారు.

ఇంటర్న్‌షిప్‌లో తెలంగాణ టాప్

- జాతీయంగా రెండోస్థానంలో రాష్ట్రం
- 96శాతం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్
- ప్రెషర్స్‌కు కంపెనీల ప్రోత్సాహకాలు

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): ఇంటర్న్‌షిప్.. చదువుకుంటూనే పరిశ్రమల పనితీరును తెలుసుకోవడం.. నైపుణ్యాలను ఆర్జించడం. పని ప్రాంతాల్లో ప్రత్యక్ష అనుభవాన్ని గడించడం. ఇలాంటి ఇంటర్న్‌షిప్‌లను అందిపుచ్చుకోవడంలో తెలంగాణ విద్యార్థులు అగ్రస్థానంలో ఉన్నారు. జాతీయంగా ఇంటర్న్‌షిప్స్ కల్పిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ 96శాతంతో టాప్ -2లో ఉంది. పక్కనే ఉన్న ఏపీ 98.33శాతంతో మొదటిస్థానంలో ఉంది. ఇదే విషయాన్ని ఇండియా స్కిల్ రిపోర్ట్ -2024 వెల్లడించింది. ఇటీవలి కాలంలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ వంటి కోర్సుల్లోని ప్రెషర్స్‌కు త్వరగా ఉద్యోగావకాశాలు లభించడంలేదు. దీంతో గ్రాడ్యుయేట్లను ప్రోత్సహించేందుకు గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ వంటి దిగ్గజ కంపెనీలు ఇంటర్న్‌షిప్‌లకు విలువనిస్తున్నాయి. వారికి మంచి స్టైపెండ్‌ను చెల్లిస్తున్నాయి. దీనికి కొనసాగింపుగా మంచి ప్లేస్‌మెంట్స్ కోసం విరివిగా ప్రోత్సహిస్తున్నాయి.

టాప్‌టెన్‌లో ఐదు దక్షిణాది రాష్ట్రాలే

జాతీయంగా ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తున్న టాప్ -10 రాష్ట్రాల్లో ఐదు దక్షిణాది రాష్ట్రాలే ఉండటం విశేషం. ఏపీ, తెలంగాణ 90శాతానికి పైగా, తమిళనాడు, కర్ణాటక, కేరళలు 88 నుంచి 84శాతం మధ్యలో ఇంటర్న్‌షిప్‌లు కల్పిస్తున్నాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ఐటీ పరిశ్రమ విస్తరించడం, మల్టీనేషనల్ కంపెనీలు దక్షిణాది రాష్ట్రాల్లోనే కొలువై ఉండటం కలిసొచ్చే అంశం. కంప్యూటర్ సైన్స్ నైపుణ్యం గల విద్యార్థులు అత్యధికంగా దక్షిణాదిలోనే ఉన్నారు. ప్రముఖ విద్యాసంస్థలైన ఐఐటీలు, ఐఐఎంలు సైతం ఉండటం కూడా అత్యధికంగా ఇంటర్న్‌షిప్‌లు ఉండటానికి ఓ కారణంగా చెప్పవచ్చు.

బీటెక్‌లో 5,039 సీట్లు ఖాళీ

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): బీటెక్ కోర్సుల్లో తుది విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత 5,039 సీట్లు భర్తీకాకుండా ఖాళీగా ఉన్నాయి. ఎప్‌సెట్ తుది విడత సీట్లను సోమవారం కేటాయించారు. కోస్గి ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీలో 93, యూనివర్సిటీల్లో 1,056, ప్రైవేట్ వర్సిటీల్లో 19, ప్రైవేట్ కాలేజీలో 3,871 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయి.

సెప్టెంబర్ 11 వరకు 'ఎన్ఎంఎంఎస్'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్‌కు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెప్టెంబర్ 11లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. వివరాలకు http :// bse. telangana. gov. in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

డీఎస్సీ 'కీ' విడుదలలో తాత్సారమేల..?

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ ప్రాథమిక కీ, రెస్పాన్స్‌షీట్ల విడుదలలో తాత్సారమెందుకని..? డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి ప్రశ్నించారు. పరీక్షలు ముగిసి వారంరోజులు గడిచినా ఇంతవరకు ప్రాథమిక కీ విడుదల చేయకపోవడం విద్యాశాఖ నిర్లక్ష్యానికి తార్కాణమని ఆరోపించారు.

'ఏకీకృత సర్వీస్ రూల్స్ వ్యతిరేకిస్తున్నాం'

హైదరాబాద్, ఆగస్టు 12 (నమస్తే తెలంగాణ): టీచర్ల ఏకీకృత సర్వీసు రూల్స్‌పై తీర్మానం చేయడాన్ని వ్యతిరేకిస్తున్నట్టు లోకల్ క్యాడర్ గవర్నమెంట్ టీచర్స్ అసోసియేషన్ (జీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు వీరాచారి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. గతంలో ఉమ్మడి సర్వీస్ రూల్స్‌కు అనుకూలంగా వచ్చిన జీవోలను కోర్టులు తిరస్కరించాయని గుర్తుచేశారు. పంచాయతీరాజ్ టీచర్లను జిల్లా పరిషత్ పరిపాలనలోకి పంపించాలని డిమాండ్ చేశారు.